క్లుప్తంగా

కుష్టు నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

పెద్దాపురం: కుష్టు వ్యాధి నివారణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18న జాతీయ కుష్టు నివారణ దినోత్సవ వాల్‌పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యుల సూచనల మేరకు కుష్టు వ్యాధిని గుర్తించే ప్రక్రియకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, ఎంపీడీఓ ఉషారాణి, కాండ్రకోట, పులిమేరు పీహెచ్‌సీల వైద్యులు ప్రియదర్శిని, శ్రావణిలతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు విన్నకోట సురేష్ తెలిపారు. ఆదివారం ఉదయం 6.30 నిమిషాల నుంచి శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. ఈ శిబిరంలో బీపీ, సుగర్ టెస్టులు ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 98664 11346 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వైభవంగా వారాహి పూజలు



కొవ్వూరులో కొలువై ఉన్న అమ్మవారు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులో కొలువై ఉన్న వారాహి అమ్మవారి నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని భక్తులు వివిధ రకాల పండ్లు, పూలతో అంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తు తరలివచ్చి అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించి, ప్రసాదాలను స్వీకరించారు.

వెంకన్న ఆలయాలకు పోటెత్తిన భక్తులు



గుమ్మళ్లదొడ్డిలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

గోకవరం: మండలంలోని తంటికొండ, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. తంటికొండలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఉదయం నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అలాగే గుమ్మళ్లదొడ్డిలో పుట్టలో వేంచేసిన వల్మీక వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



జి.కొత్తపల్లిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శనివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

అప్రమత్తతే ఆయుధం

- వాతావరణ మార్పులతో విజృంభిస్తున్న వ్యాధులు
- అప్రమత్తమైన అధికారులు
- వ్యాధుల వ్యాప్తికి ఆదిలోనే అడ్డుకట్ట
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: రుతుపవనాలు, ద్రోణి ప్రభావంతో నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వ్యాధులు విజృంభించే అవకాశాలు ఉన్న ప్రాంతాలను గుర్తించడంతో పాటు వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా వ్యాధులకు కారణమయ్యే దోమలు, క్రిమికీటకాలను ఆదిలోనే నిర్మూలించేలా చర్యలు చేపట్టారు.

గ్రామాల్లో ప్రత్యేక చర్యలు

దోమలు, ఈగలు, మట్టి మలినాలు, అపరిశుభ్ర వాతావరణం, చేతులు శుభ్రం చేయకపోవడం, నీరు కలుషితం వంటి వాటి వల్ల వ్యాధులు విజృంభించే అవకాశాలు ఉన్న విషయాన్ని ప్రజలకు వివరించడమే వాష్ ప్రోగ్రాం లక్ష్యం. దీనిలో భాగంగా గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే చేస్తున్నారు. అంతేకాకుండా వెక్టార్ బోర్న్, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు కలగజేసే దోమల నివారణకు చర్యలు తీసుకోవడం. శానిటేషన్, తాగునీరు, శుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం. అంటువ్యాధులకు కారణమయ్యే కుళ్లిన, నిల్వఉన్న ఆహార పదార్థాలు తినకుండా ప్రజలను అప్రమత్తం చేయడం. చేతులను శుభ్రం చేసుకునే విధానాలను ప్రజలకు వివరించడం వంటి చర్యలు తీసుకోవడం. గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి దోమలు గుడ్లు పెట్టే అవకాశాలున్న పరిసరాలను గుర్తించి దోమలను లార్వా దశలోనే నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

గ్రామాల బాట పట్టిన వైద్య సిబ్బంది

వైద్యారోగ్య శాఖాధికారులు గ్రామాల బాట పట్టారు. బృందాలుగా విడిపోయి పల్లెల్లో పర్యటిస్తున్నారు. గృహాలను సందర్శించి రోగాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నారు. ఇళ్ల వద్ద దోమలు నిల్వ ఉండే పరిసరాలు, గోతులు, ఖాళీ డబ్బాలు, డ్రైన్లు వంటి వాటిని పరిశీలించి దోమలు వ్యాప్తి చెందకుండా మందులు పిచికారీ చేస్తున్నారు. ముఖ్యంగా బురద, నీరు నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని అన్ని మురికి కాలువల్లోనూ దోమల నివారణ మందులు పిచికారీ చేస్తున్నారు. ఫీవర్ సర్వే చేసి ఇళ్లల్లో జ్వర లక్షణాలు ఉన్నవారికి తక్షణ వైద్య సదుపాయం కల్పిస్తున్నారు.

ముందు జాగ్రత్త చర్యలతో నివారణ

గొల్లప్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులను కట్టడి చేయగలుగుతున్నాం. ఎక్కడ దోమలు వ్యాప్తి చెందుతాయో గుర్తించి వాటి నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ప్రతి ఆశ కార్యకర్త తమ పరిధిలో ప్రతిరోజూ 30 కుటుంబాలను సందర్శించి వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించాం. మలేరియా, మెదడువాపు, స్వైన్ ఫ్లూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, నీళ్ల విరేచనాలు, కలరా, పచ్చకామెర్లు వంటి వ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయో ప్రజలకు వివరిస్తున్నాం. ప్రజలు పరిశుభ్రత పాటించాలి. తాజా, వేడి ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ శ్యామల, వైద్యాధికారి గొల్లప్రోలు

నిరుపయోగంగా సోలార్ బ్లింకర్లు



కాకినాడ రోడ్డులో పెట్రోల్ బంకు సమీపంలో తీగలతో మూసుకుపోయిన సోలార్ బ్లింకర్

సామర్లకోట: ప్రమాదాల నివారణకు ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన సోలార్ స్తంభాలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ సంస్థ కాకినాడ రోడ్డులోను, పంచారామ క్షేత్రానికి వెళ్లే గోదావరి బ్రిడ్జి వద్ద, ఆయా ముఖ్య కూడళ్లలో, మలుపుల్లో సోలార్ బ్లింకర్ లైట్లు ఏర్పాటు చేశారు. ఆ స్తంభాలకు నేడు పిచ్చి మొక్కల తీగలు అల్లుకుపోయి అసలు అక్కడ ఓ స్తంభం ఉందన్న విషయం కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఆ మొక్కలను ఆర్ అండ్ బీ అధికారులు తొలగించాల్సి ఉంది. అధికారులు స్పందించి సోలార్ బ్లింకర్లను వినియోగంలోకి తీసుకువచ్చే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గతం వద్దు.. గ్రామీణాభివృద్ధే ముద్దు

- అధికారులు, ప్రజా ప్రతినిధుల సమష్టి సహకారంతో గ్రామీణాభివృద్ధి
- మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే చిన రాజప్ప



శిలాఫలకం పగులగొట్టారని ఎమ్మెల్యేకు చెబుతున్న ఉలిమేశ్వరం ఎంపీటీసీ వరలక్ష్మి

పెద్దాపురం: మండల అభివృద్ధిలో గతాన్ని మరచి రానున్న రోజుల్లో గ్రామీణాభివృద్ధికి కృషి చేద్దామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పెద్దాపురం మండల పరిషత్ సమావేశం శనివారం ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను పక్కన పెట్టి అభివృద్ధివైపు నడవాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధికి కృషి చెయ్యాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజా ప్రతినిధులు తమ సమస్యలను అధికారుల ముందుంచాలని ఎమ్మెల్యే పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఉలిమేశ్వరం సర్పంచ్ ఆకుల వరలక్ష్మి మాట్లాడుతూ తమ గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద ప్రభుత్వ శిలాఫలాలకు పగులగొట్టడం సరికాదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ దీనిపై తర్వాత చర్చిద్దామని సమస్యలు, గ్రామాల అభివృద్ధిపై చర్చించాలన్నారు. పులిమేరు పీఏసీఎస్ అధ్యక్షులు గోపు నారాయణమూర్తి మాట్లాడుతూ రైతులు ఏలేరు నీటిని సకాలంలో విడుదల చేయలేదన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేవని అధికారులు దీనిపై వివరణ ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఏలేరు నీటిని పూర్తి స్థాయిలో విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విత్తనాలు, ఎరువులపై వ్యవసాయాధికారులు వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో వ్యవసాయాధికారి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని కట్టమూరు, పులిమేరు, కాండ్రకోట, పెద్దాపురంలలో రైతులకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. కాండ్రకోట ఎంపీటీసీ భద్రరావు మాట్లాడుతూ కాండ్రకోట మీదుగా కాకినాడ–తామరాడ ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరారు. త్వరలోనే ఆర్టీసీ సర్వీస్ పునరుద్ధరణకు చర్యలు చేపడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మండలంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను మరింత మెరుగుపరిచి ప్రజారోగ్యంపై మరింత శ్రద్ధ కనబరచాలన్నారు. అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడి విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీడీఓ ఎం.ఉషారాణి, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ ఉషారాణి, ఏపీఎం సూర్యనారాయణ, సర్పంచ్‌లు కనపర్తి చీమదొర, మొయిళ్ల కృష్ణమూర్తి, తుమ్మల నాని, మాకిరెడ్డి శ్రీనివాస్, కురిమెళ్ల లోవరాజు, ఎంపీటీసీలు నల్లల సూర్యకుమారి, కుంచే బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి వంగా గీత పరామర్శ



సూర్యారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వంగా గీత, నాయకులు

కొత్తపల్లి: మండల ఎంపీపీ కారే సుధను వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత శనివారం పరామర్శించారు. ఇటీవల ఎంపీపీ తండ్రి బెణుగు సూర్యారావు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వంగా గీత ఎంపీపీ సుధతో పాటు మండల కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసు, బెణుగు ఈశ్వరరావులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, నాగం గంగబాబు, పేకేటి హరికృష్ణ, మడత హేమంత్, రావుల మాధవరావు, కారే కిరణ్, చేపల నరేష్ తదితరులు ఉన్నారు.

షెల్టర్ ఎవరికోసమో..



మేడపాడు బస్సు షెల్టర్‌కు అడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సామర్లకోట: కెనాల్ రోడ్డులో జి.మేడపాడు గ్రామానికి చెందిన బస్ షెల్టర్‌కు అడ్డుగా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామం నుంచి బిక్కవోలు, అనపర్తి, రాజమహేంద్రవరానికి వెళ్లే ప్రయాణికులు కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకుల ఏర్పాటుచేసిన ఫ్లెక్సీతో అవస్థ పడుతున్నారని గ్రామ నాయకుడు నలమాటి జానికి రామయ్య ఆరోపించారు. దీని వల్ల వచ్చే బస్సులు కనపడడం లేదని, దీనికి తోడు శనివారం ఉదయం నుంచి చినుకులు పడుతూ ఉండటంతో ప్రయాణికులు బస్సు షెల్టర్ బయటకు వచ్చి వర్షంలో నిలబడుతున్నారని ఆయన అన్నారు. అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తలలు పండినా.. తలపులు కొంటెవే..!



పరిచయాలు.. మాటా మంతీలో పూర్వ విద్యార్థులు



ఆనాటి అల్లర్ల దొంతర్లతో నాటి నవ యువకుల ముచ్చట్లు

- గతకాలపు మాధుర్యంలో లూథరన్ పూర్వ విద్యార్థులు
- ఆత్మీయంగా సందడి చేసిన 1967–69 ఎస్ఎస్ఎల్‌సీ బ్యాచ్‌లు

పెద్దాపురం: వారందరికీ దాదాపు ఏడు పదుల నుంచి ఎనిమిది పదుల వయస్సు దాటింది. వారందరికీ తలలు పండిన పిల్లలు ఉంటారు. తనువుకే వయసు కానీ.. మనసుకు ఉండదు కదా.. శారీరకంగా నేడు కొంత లొంగి ఉండవచ్చు కానీ మానసికంగా వారు నేటికీ అల్లరి పిడుగులేనని చెప్పకనే చూపారు. బోసి నవ్వుల గలగలలు.. గతం గుర్తు చేసిన అల్లరి పనులు వారిని నేడు గిలిగింతలు పెట్టాయి. వారి అల్లర్లకి వేదికైంది స్థానిక పెద్దాపురం లూథరన్ పాఠశాల. 1967–69 ఎస్ఎస్ఎల్‌సీ రెండు బ్యాచ్‌ల విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వారంతా ఆత్మీయంగా కలుసుకున్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, వివిద హోదాల్లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులు ఒక చోట కలిసి తమ గతకాలపు అల్లర్లలోకి వెళ్లిపోయారు. హోదాలు, అంతరాలు మరచి ఏకవచన సంభోదనలతో, నిక్‌నేమ్‌లతో పిలుచుకుంటూ, అప్పటి గురువులను, తోటి ఆడపిల్లలను ఆటపట్టించిన సరదా సంఘటనలతో సందడి చేశారు. కలుసుకున్న కొద్దిసేపూ ఎన్నో ఏళ్ల జ్ఞాపకాల దొంతరల్లోకి వెళ్లిపోయి వర్తమానంలోకి వచ్చి ఒకరికొకరు ఆరోగ్యాలు, పిల్లల స్థితిగతులు పంచుకుని సంతోషాల్లో మునిగి తేలిపోయారు. స్థానిక మట్టే ఆదినారాయణ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సమావేశమైన వారంతా ముందుగా తాము చదివిన లూథరన్ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు అవసరమైన బల్లలను విద్యార్థులకు అవసరమైన బల్లలను బహుకరించారు. ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ వారిలో కొందరిని మిగిలిన వారు సత్కరించారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త, దాత మట్టే సత్యప్రసాద్, పారిశ్రామికవేత్త గోలి రామారావు, విశ్రాంత ఉద్యోగులు బద్ది కృష్ణ విద్యాసాగర్, థామస్‌తో పాటు సుమారు వంద మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



జ్యోతిర్లింగ వెంకటరామ



సత్య



దుర్గాప్రసాద్



వెంకటపవన్



మద్ద యామినీ సత్యనిహారిక



నందకం పావన

కొత్తపల్లి: ట్రిపుల్ ఐటీకి కొత్తపల్లి మండలం నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ శనివారం తెలిపారు. కొమరగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన కోళ్ల జ్యోతిర్లింగ వెంకటరామ (నూజివీడు), దారబాలు సత్య (శ్రీకాకుళం), కొండా దుర్గాప్రసాద్ (ఒంగోలు) ట్రిపుల్ ఐటీలకు ఎంపికై నట్టు చెప్పారు. యండపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన గ్రంధి వెంకట పవన్ (నూజివీడు) ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మేడపాడు విద్యార్థులు..

సామర్లకోట: మండల పరిధిలోని జి.మేడపాడు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్స్‌లో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయి. ఈ మేరకు ఆయా పాఠశాలల హెచ్‌ఎం జి.పాండవులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిలో మద్ద యామినీ సత్య నిహారికకు శ్రీకాకుళంలోను, నందకం పావనకు ఒంగోలులోను సీట్లు వచ్చాయని తెలిపారు. విద్యార్థులను ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, హెచ్‌ఎం పాండవులు, పీడీ యార్లగడ్డ బంగార్రాజు, గ్రామ నాయకులు పాలకుర్తి శ్రీనివాసాచార్యులు, పాలకుర్తి రవిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఖాళీ స్థలాలు.. దోమల కార్ఖానాలు!

- అప్రమత్తం కాకుంటే అనారోగ్యాలు ప్రబలే ప్రమాదం
- జాగా కనిపిస్తే చాలు స్థానికులకు అదే డంప్ యార్డు
- వారినే అనుసరిస్తూ ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్న పారిశుధ్య సిబ్బంది



తూరంగి పగడాలపేట వద్ద గుట్టగా వేసిన చెత్త

కాకినాడ సిటీ: ఖాళీ స్థలాలు వ్యాధులకు కేంద్రంగా నిలుస్తున్నాయి. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ చెత్త వేస్తున్నారు. వ్యర్థాలు, చెత్త, చెదారం, ప్లాస్టిక్ ఖాళీ స్థలాల్లో పడవేయడం ద్వారా దోమలు వ్యాపిస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

ఖాళీ స్థలాల్లో చెత్త చెదారం

కాకినాడ నగరపాలక సంస్థతో పాటు గ్రామాల్లో ఖాళీ స్థలాలు చెత్త చెదారానికి నిలయంగా మారుతున్నాయి. నగరంలోని సాంబమూర్తినగర్, దుమ్ములపేట, పర్లోవపేట, కొత్త కాకినాడ, గొడారిగుంట, ఏటిమొగ, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో రోడ్ల వెంట చెత్త దర్శనమిస్తోంది. కాకినాడ రూరల్ మండలంలోని తూరంగి, రమణయ్యపేట, కొవ్వూరు, తిమ్మాపురం, సర్పవరం, ఇంద్రపాలెం, చీడిగ, కొవ్వాడ, వాకలపూడి, వలసపాకల, పండూరు, నేమాం, కరప మండలంలోని అనేక గ్రామ పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తూరంగి పంచాయతీలో జనావాసాలను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో చుట్టుపక్కల వారు చెత్త వేసేస్తున్నారు. కొందరు పంచాయతీ సిబ్బంది కూడా బళ్లతో తీసుకువచ్చే చెత్తను ఇక్కడే వేసేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం డంప్‌యార్డును తలపిస్తూ ముక్కుపుటాలు అదిరిపోయే పరిస్థితి నెలకొంది. తూరంగి గ్రామంలో రూ. కోట్ల ఖర్చుతో డ్రైనేజీలు వేసినా ప్రజలకు ఉపయోగపడక పోగా, చుక్క మురుగునీరు కూడా పారడం లేదని, ఎక్కడ నీరు అక్కడ నిలచిపోయి దుర్వాసన వెదజల్లుతోందని, అనేక మంది రోగాల బారినపడుతున్నామని చెబుతున్నారు.

ఎక్కువైన కుక్కల సంచారం

ఖాళీ స్థలాల్లో వేసిన వ్యర్థాల కోసం కుక్కలు ఎగబడుతున్నాయి. ఈ క్రమంలో కుక్కల సంతతి అంతకంతకూ పెరగడమే కాకుండా ఆ వ్యర్థాల కోసం వాటికవి కలబడుతూ ఆ వైపుగా వెళ్లే పాదచారులు, వాహనచోదకులపై ఎక్కడ పడతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధులు ప్రబలే అవకాశం

ఖాళీ స్థలాల్లో వేసిన చెత్త చెదారంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. చెత్త నిల్వలు, వాటికి తోడు వర్షాలు పడితే నానిపోయి నీరు నిల్వ ఉండిపోయి దోమల కార్ఖానాలుగా తయారవుతున్నాయి. పర్యవసానంగా డెంగీ, చికున్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్తను తక్షణమే తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

చెత్తను తొలగించకపోతే జరిమానా



కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో స్థలాలను కొందరు కొనుగోలు చేసి ఖాళీగా వదిలేయడంతో ఆ స్థలాల్లో వ్యర్థాలు పేరుకు పోతున్నాయి. దీని వల్ల సమీప ప్రాంతాల్లో ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీగా వదిలేసిన స్థలాల్లో పేరుకుపోతున్న చెత్తను స్థల యజమానులు తక్షణం తొలగించాలని నోటీసులు జారీ చేస్తున్నాం. ఏ కారణం చేతనైనా స్థల యజమానులు అందుబాటులో లేకపోతే నగరపాలక సంస్థే ఆయా స్థలాల్లో ఉన్న వ్యర్థాలను తొలగించి, అందుకు అయ్యే ఖర్చును స్థల యజమానుల నుంచి వసూలు చేస్తాం. ఇప్పటికే ఖాళీస్థలాల యజమానులకు చెత్త తొలగించే చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశాం.

– జె.వెంకటరావు, నగరపాలక సంస్థ కమిషనర్, కాకినాడ

నియోజకవర్గ ఉద్యోగుల సంఘం ఏర్పాటు



పిఠాపురం నియోజకవర్గ ఉద్యోగుల సంఘం సభ్యులు

పిఠాపురం: నియోజకవర్గంలో నివాసం ఉంటున్న ఉద్యోగులతో శనివారం పిఠాపురం నియోజకవర్గ ఉద్యోగుల సంఘం (పీఈడబ్ల్యూ)ను శనివారం ఏర్పాటు చేశారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన సంఘాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల శాఖ, కులం, మతం రాజకీయాలకు అతీతంగా పిఠాపురం నియోజకవర్గం పరిధిలో నివసిస్తున్న ఉద్యోగులందరినీ ఏకం చేయాలనే దృక్పథంతో ఈ సంఘం ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగుల సంక్షేమం, ఐక్యమత్యమే లక్ష్యంగా సంఘం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ ఏవీవీ సత్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రావు అప్పారావు, డాక్టర్ విజయ శేఖర్, పీఈడబ్ల్యూ ఫౌండర్ చామంతి నాగేశ్వరరావు, అధ్యక్షుడు చందు బాబూరావు, జనరల్ సెక్రెటరీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

19న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

తుని: అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ఈ నెల 19న తుని ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు నడుతున్నట్టు డిపో మేనేజరు ఎస్.కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. విజయవాడ, శ్రీకాళహస్తి, శ్రీపురం, పౌర్ణమి రోజున అరుణాచలం గిరిప్రదక్షిణ అనంతరం కంచి దర్శనం ఉంటుందన్నారు. పెద్దలకు టికెట్టు రూ.3500, పిల్లలు రూ.2625గా నిర్ణయించామన్నారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.